నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 16 జనవరి 2025 | SURYAPET

## 11 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన ఎస్ఐలతో ఎస్పీ శరత్ చంద్ర పవార్

నీలగిరి, జనవరి 15 : 11 మంది ఏఎస్ఐలు ఎస్ఐలుగా పదోన్నతి పొందారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వారికి స్టార్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి పొందిన ఏఎస్ఐలకు పదవితో పాటు బాధ్యతలూ పెరుగుతాయని, క్రమశిక్షణతో, బాధ్యతగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



చిలుకూరులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

# ఆఫీసుల్లో ఉండరు.. ఆన్సర్ చేయరు

## విధులపై జిల్లా అధికారుల్లో అనాసక్తి



- ఆయా శాఖల్లో ఎక్కడికక్కడే పలు పెండింగ్ పనులు
- కలెక్టర్ లైన్‌లోకి వెళ్లినా లెక్కచేయని పరిస్థితులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- ఇటీవల పలువురిపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్

**'ది నంబర్ ఈజ్ ఔట్ ఆఫ్ నెట్‌వర్క్.. ది నంబర్ ఈజ్ స్విచ్‌డ్ ఆఫ్.. ది పర్సన్ యూ ఆర్ కాలింగ్ ఈజ్ నాట్ ఆన్సరింగ్' ఇదీ జిల్లాలో పలు శాఖలకు చెందిన అధికారులకు కాల్ చేస్తే వచ్చే సమాధానం. అట్లని కార్యాలయాల్లోకి వెళ్తే సార్ ఫీల్డ్ మీదికి వెళ్లాడు.. మేడం టూర్‌లో ఉన్నారు.. అనే జవాబులు ఆయా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది చెప్పే మాటలు. సాధారణ జనమే కాదు.. ఏకంగా కలెక్టర్ లైన్‌లోకి వెళ్లినా కొంత మంది నుంచి ఇదే సమాధానం వస్తుందట. దాంతో పలువురిపై ఆగ్రహం, అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్.. ఇటీవల ఒక జిల్లా ఆఫీసర్‌ను సరెండర్ చేయడంతోపాటు ఇద్దరికి నోటీసులు ఇవ్వడం గమనార్హం. జిల్లా అధికారులే చేయంది మాకేందిలే అనుకున్నారేమో కింది స్థాయిలో పనిచేస్తున్న వారు కూడా అలాగే వ్యవహరిస్తుండటంతో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేశారు. పలువురికి నోటీసులు ఇచ్చి అనేక మందిపై అసహనం వ్యక్తం చేసినట్లు కలెక్టరేట్‌లో చర్చలు వినిపిస్తున్నాయి.**

– నల్లగొండ, డిసెంబర్ 15



### బాధ్యతారాహిత్యంగా హెచ్‌ఓడీలు

ప్రభుత్వానికి, ప్రజలకు వారుధులుగా ఉండాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల పట్ల అనాసక్తి కనబరుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆయా శాఖలకు బాధ్యులుగా ఉండాల్సిన హెచ్‌ఓడీ (హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్)లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరిస్తుండటంతో పెండింగ్ పనులు పేరుకుపోతున్నాయి. సర్కార్ పథకాలను కింది స్థాయిలో అమలు చేయాల్సిన వారు వాటిని కూడా పట్టించుకోకుండా ఆయా శాఖల్లో ఏదైనా సమస్య ఉండి వచ్చేవారికి అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఫోన్ చేస్తే తీయరని.. ఆఫీసుకు వెళ్తే ఉండరనే విమర్శలు బాగా ఉన్నాయి. ప్రధానంగా కలెక్టరేట్‌లోని ప్రధాన శాఖలతోపాటు పాడి, పండ్ల అనుబంధ శాఖల అధికారులు తమ విధులను మొక్కుబడిగా నిర్వహిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గ్రీవెన్స్‌కు కూడా హాజరు కాకపోవడం, టూర్, క్షేత్రస్థాయి పర్యటనల పేరుతో సాకులు చెప్పి ఏకంగా కలెక్టర్‌నే లెక్కచేయట్లేదనే చర్చలు కలెక్టరేట్‌లో సాగుతున్నాయి. కొందరు కింది స్థాయి ఉద్యోగులను టార్చర్ పెట్టి వారు మాత్రం నిర్లక్ష్యంగా ఉండటంపై విమర్శలు వచ్చాయి. ఇలాంటి ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ ఒక జిల్లా అధికారిని ఇటీవల సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ప్రధానంగా సంక్షేమ అధికారుల్లో ఒకరిద్దరు నిత్యం టూర్లు, క్షేత్ర స్థాయి పర్యటనల పేరుతో కాలం గడుపుతున్నారే తప్ప విధులపై ఆసక్తి మాత్రం కనబరుస్తలేరనే విమర్శలు ఉన్నాయి.

### సార్లు లేకపాయె.. సిబ్బంది సోది మాటలాయె

పలు శాఖల్లోని హెచ్‌ఓడీలకు విధులపై ఉన్న అనాసక్తి వల్ల కింది స్థాయి సిబ్బంది టైమ్‌పాస్ ముచ్చట్లతో కాలం గడుపుతున్నారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా వెటర్నరీ, ఉద్యాన, పంచాయతీరాజ్, పౌరసరఫరాల, ఫిషరీస్, ఆయా కార్పొరేషన్లు, వెల్ఫేర్ శాఖల అధికారులు ఫోన్లు కూడా ఎత్తకుండా ఉండటం.. కింది స్థాయి సిబ్బంది సోది మాటలతో కాలం గడుపుతున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. అయితే.. ఆయా శాఖల్లో పెండింగ్ పనులు బాగా పేరుకుపోవడంతో కలెక్టర్ సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇక క్షేత్ర స్థాయిలో కూడా పలువురు సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే అప్పటికప్పుడే ఆగ్రహంతో నోటీసులు ఇవ్వండి.. సస్పెండ్ చేయండి అంటూ సాయంత్రం వరకు జాలి చూపించి వదిలేస్తున్నారట. ఇది కూడా బద్ధకపుదారులకు కలిసివచ్చి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు తెలుస్తుంది. ఇటీవల నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో దరఖాస్తుదారులు లేకున్నా, ఫోన్ కలువకపోయినా.. వారు వద్దు అని అన్నట్లు చెప్పి వందకు వంద శాతం చేశామనే అబద్ధాలు చెప్పినట్లు కలెక్టర్ దృష్టికి వచ్చి సీరియస్ అయ్యారట.

# సంబురంగా.. సంక్రాంతి

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉట్టిపడిన పండుగ శోభ
- ఊరూరా ఆనందోత్సాహాలతో సంక్రాంతి, కనుమ వేడుకలు

రామగిరి, జనవరి 15 : ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు.. వాటిల్లో ఉంచిన గొబ్బెమ్మలు. ఆకాశంలో గాలి పటాల సందడి, హరిదాసుల సంకీర్తనలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. నోరూరించే పిండి వంటలు.. బంధుమిత్రుల కోలాహలంతో మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటేలా వైభవంగా సాగాయి. ఊర్లకు వచ్చిన పట్టణవాసులతో పల్లెలు సందడిగా మారాయి. భక్తులతో ఆలయాలు కిక్కిరిశాయి. ముంగిళ్లలో సంక్రాంతి ముగ్గులు ముచ్చటగొలిపాయి. సంబురాల సంక్రాంతి వేడుకలు ఉత్సాహ వాతావరణంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైభవోపేతంగా జరిగాయి. తెల్లవారుజామునే లేచి వాకిళ్లను శుభ్రం చేసి మహిళలు లోగిల్లలో రంగవల్లులు వేసి వాటిల్లో గొబ్బెమ్మలు పెట్టి సంస్కృతిని చాటారు. భక్తులు ఆలయాలకు వెళ్లి తామంతా సుఖసంతోషాలతో ఉండాలని పూజించారు. జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయం, వాడపల్లి మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి, నల్లగొండలోని రామగిరిలో గల సీతారామచంద్రస్వామి, పానగల్ ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలతోపాటు అన్ని ఆలయాల్లో భక్తులు పోటెత్తారు.



నల్లగొండలో ముగ్గు వేస్తున్న మహిళ



సర్వారం గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి

## సర్వారంలో 31మందికి డయేరియా

- మెడికల్ క్యాంపు నిర్వహించిన వైద్యాధికారులు

తిప్పర్తి, జనవరి 15 : మండలంలోని సర్వారం గ్రామంలో డయేరియా విజృంభిస్తున్నది. ఇప్పటికే 31 మంది డయేరియా బారిన పడి వాంతులు, విరోచనాలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి ప్రదీప్ బాబు, వైద్య సిబ్బందితో కలిసి బుధవారం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. డయేరియా బారిన పడిన వారికి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రజల ఇబ్బందులకు కారణం తాగునీరే అని పేర్కొన్నారు. వాటర్ ట్యాంకును, వాటర్‌ను పరిశీలించి తాగునీటిని ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. రిపోర్టు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ప్రజలు మామూలు స్థితికి వచ్చే వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

## గుర్రంపోడు పీహెచ్‌సీ సిబ్బందిపై కలెక్టర్ సీరియస్

- విధులకు గైర్హాజరైన 8 మంది సిబ్బంది సస్పెన్షన్

గుర్రంపోడ్, జనవరి 15 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విధులకు గైర్హాజరు కావడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. అందరినీ సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం గుర్రంపోడు పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎవరూ విధుల్లో లేరు. పీహెచ్‌సీ హెల్త్ అధికారి హరిలాల్ మాత్రం డిప్యూటేషన్‌పై ఇతర చోట పని చేస్తున్నారు. మిగతా అందరూ ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఫార్మాసిస్ట్ శ్యామ్, ల్యాబ్ టెక్నీషియన్ సంధ్య, డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధవి, అటెండర్లు శ్రీనివాస్, అరుణజ్యోతి, ఎల్లమ్మను ఉద్యోగం నుంచి తొలగించారు. రెగ్యులర్ ఉద్యోగులు అయిన ఫార్మాసిస్ట్ భాగ్యమ్మ, అటెండర్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే ప్రతి ఉద్యోగిపై ఇలాంటి చర్యలే తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసి సిబ్బంది మొత్తం గైర్హాజరు కావడం బాధాకరమని, అందువల్లే అందరినీ తొలగించామని కలెక్టర్ తెలిపారు.



గుర్రంపోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## చైనా మాంజా తగిలి దంపతులకు గాయాలు

- బీబీనగర్‌లో మరో గొంతుకు తీవ్ర గాయం

యాదగిరిగుట్ట, జనవరి 15 : చైనా మంజా తగిలి దంపతులు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట గ్రామానికి చెందిన నారాయణ తన భార్య వీరమణితో కలిసి ద్విచక్ర వాహనంపై యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. యాదగిరిగుట్ట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్దకు రాగానే చైనా మాంజా నారాయణ గొంతుకు తగిలి గాయమైంది. దాంతో వాహనాన్ని ఒక్కసారిగా నిలుపడంతో వెనుక కూర్చున్న వీరమణి కింద పడిపోగా తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి వెళ్లింది. గమనించిన స్థానికులు వెంటనే 108 సాయంతో భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.



బీబీనగర్ ఎయిమ్స్‌లో దాసరి రాముకు చికిత్స అందిస్తున్న వైద్యులు

**బీబీనగర్‌లో ఒకరికి తీవ్ర గాయం**

బీబీనగర్ : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌కు చెందిన దాసరి రాము బుధవారం తన సొంత పనుల నిమిత్తం భువనగిరికి వెళ్లాడు. తిరిగి బోడుప్పల్‌కు వెళ్తుండగా.. బీబీనగర్ మండలంలోని ఫ్లైఓవర్ మీద చైనా మాంజాతో కూడిన తెగిన గాలి పటం తగిలి చేతికి, గొంతుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికంగా ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లగా.. పరీక్షించిన డాక్టర్లు మెడతోపాటు చేయి తెగిందని తెలిపి చికిత్స అందించారు.

## ప్రాణం తీసిన పతంగి సరదా..

- దాబా పైనుంచి జారి పడి వ్యక్తి మృతి



జూపల్లి నరేందర్ (ఫైల్)

మోటకొండూరు, జనవరి 15 : సంక్రాంతి పండుగ పూట యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని అమ్మనబోలు గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, సరదాగా గడుపుతున్న వేళ పతంగి ఓ వ్యక్తి ప్రాణం తీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మనబోలు గ్రామానికి చెందిన జూపల్లి నరేందర్ (48) మంగళవారం సంక్రాంతి రోజు కుటుంబ సభ్యులతో కలిసి తన అన్న ఇంటి దాబాపై పతంగి ఎగురవేస్తున్నాడు. చుట్టూ గోడ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడగా.. తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆలేరు దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి నరేందర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దాంతో అప్పటివరకు సరదాగా గడిపిన నరేందర్ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నరేందర్‌కు భార్య ఉంది. పిల్లలు లేరు.



తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు

## బీఆర్ఎస్ శ్రేణుల ముందస్తు అరెస్టు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్ : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు సమాయత్తమవుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, శ్రేణులను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. కొన్నిచోట్ల ఆందోళనలకు పిలుపునివ్వకున్నా పండుగ పూట ఉదయాన్నే ఆ పార్టీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అరెస్టుల పర్వం కొనసాగింది. హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్నందునే కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులకు పాల్పడుతుందని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రజా పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. ఎన్ని కేసులు పెట్టినా, అక్రమ నిర్బంధాలు చేసినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు.



హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు

## యువకుడికి కత్తి పోట్లు

- చికిత్స పొందుతూ మృతి

నందికొండ, జనవరి 15 : యువకుడిని కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన నాగార్జునసాగర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జున సాగర్‌లోని హిల్‌కాలనీకి చెందిన నాగుర్ బాషా (21) బాస్కెట్ బాల్ జాతీయ స్థాయి క్రీడాకారుడు. స్థానికంగా కేబుల్ నెట్‌వర్క్‌లో పని చేస్తున్నాడు. కాగా, పైలాన్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లుతో మంగళవారం మధ్యాహ్నం గొడవ జరిగింది. ఈ విషయంపై అదే రోజు రాత్రి 10గంటల సమయంలో హిల్‌కాలనీలోని ఓ పార్టీ నాయకుడు ఇద్దరినీ పిలిచి సర్ది చెప్పి పంపించాడు. అనంతరం బయటకు వచ్చిన వెంకటేశ్వర్లు తన వెంట తెచ్చుకన్న కత్తితో నాగుర్ బాషా పొట్టలో పొడిచాడు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక కమలా నెహ్రూ ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దాంతో తమకు న్యాయం చేయాలని మృతుడి బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద, హత్య జరిగిన నివాసం ఎదురుగా మృతదేహంతో ఆందోళన చేపట్టారు. పోలీసులు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. ఇద్దరి మధ్య గొడవకు గల కారణాలు తెలియలేదని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.



నాగుర్ బాషా (ఫైల్)

## 18న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్దవూర, జనవరి 15: మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వెబ్ సైట్‌లో అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష హిందీ, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుందని, అడ్మిట్‌కార్డు లేకుండా విద్యార్థులను అనుమతించరని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, ఉదయం 10.30 గంటలలోపు పరీక్ష కేంద్రంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

## ఉద్యోగాల కోసం దరఖాస్తుకు నేడు తుది గడువు

- సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ, జనవరి 15: దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో ఇండ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గురువారం వరకు అవకాశం ఉందని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ తెలిపారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 133 మంది ఇండ్లు కోల్పోయినట్లు గుర్తించామని, ఇందులో 116 మంది పేర్లతో కూడిన జాబితాను ఉద్యోగాల కోసం జెన్‌కో బోర్డుకు పంపినట్లు పేర్కొన్నారు. ఒకరు పరిహారం తీసుకుంటామని చెప్పారని, మిగిలిన 16 మందికి వారసత్వం సరిగా లేని కారణంగా ఆలస్యమవుతుందని, వారి పేర్లను కూడా బోర్డుకు పంపినట్లు తెలిపారు. పవర్‌ప్లాంట్‌లో భూములు కోల్పోయిన 525 కుటుంబాలు ఉన్నాయని ఇందులో 400 కుటుంబ సభ్యులు తమ వారసత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఇందులో 225 మంది నిబంధనలకు అనుగుణంగా అర్హులుగా ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట తాసీల్దార్ హరిబాబు ఉన్నారు.